క్లుప్తంగా

మాతమ్మ గుడికి విరాళం



రాజేష్‌కు నగదు అందజేస్తున్న భాస్కరరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో రేణుమాకుల పల్లెలోని మాతమ్మ గుడి నిర్మాణానికి పాపిరెడ్డి గారిపల్లెకు చెందిన జి.భాస్కరరెడ్డి సోమవారం రూ.25వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశు, జంపాల రాజేష్, లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్సీ ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న క్రిష్ణమూర్తి

గుడుపల్లె: మండలంలోని సంగనపల్లె జోగిండ్లులో మృతుడు కుటుంబానికి వైయస్‌ఆర్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ రూ 10 వేలు ఆర్థిక సాయం చేశారు. సోమవారం జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి ఆ గ్రామానికి వెళ్లి మృతుడు క్రిష్ణప్ప కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియలకు ఎమ్మెల్సీ ఇచ్చిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అమరనాథ్, ఎంపీటీసీ వెంకటమ్మ, విశ్వనాథ్, సంపంగి పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

పలమనేరు: మండలంలోని మండిపేట కోటూరు ఎస్సీ కాలనీలో మండల నిధులు రూ.6లక్షలతో సీసీ రోడ్డు పనులకు సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రంగనాథం, నాయకులు చక్రపాణి, వెంకటాచలం, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు. తమ ప్రాంతానికి సీసీ రోడ్డు మంజూరు చేయించిన స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, మండల నాయకులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పౌర్ణమి ప్రత్యేక పూజలు

రామకుప్పం: స్థానిక శ్రీ అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం పౌర్ణమి దీపం వెలిగించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గణనాథుని సేవలో తనికెళ్ల భరణి



తనికెళ్ల భరణికి ప్రసాదాలు అందజేస్తున్న ఆలయాధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, నాయకులు చిన్నారెడ్డి, రవిరెడ్డి, పుణ్యసముద్రం రవి, సుధీర్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలి

తిరుపతి కల్చరల్: సంచార జాతుల ఎంబీసీ, దాసరి, మేదరి, జంగం, వడ్డెర, యాతా, రెడ్డిక వంటి కార్పొరేషన్లకు నిధులు విడుదల చేసి ఆదుకోవాలని సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపూరు దోలాకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షలకు పైగా ఉన్న సంచార జాతుల వారు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటారని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని సంచార జాతుల జన గణన చేపట్టాలని కోరారు. సమావేశంలో సంచార జాతుల అభివృద్ధి మండలి తిరుపతి జిల్లా నేతలు ప్రసాద్, జి.వెంకటసుబ్బయ్య, మహిళా కార్యదర్శి ఆకుల సుమతి పాల్గొన్నారు.

సంతలో అన్నదానం

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వారపు సంతలో సోమవారం రైతులకు, చిరు వ్యాపారులకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా

- పారిశుద్ధ్యం మరింత మెరుగు
- అభివృద్ధి పనులతో సుందర పట్టణంగా పుంగనూరు
- వార్డుబాట ముగింపులో మంత్రి పెద్దిరెడ్డి



వార్డుబాట కార్యక్రమంలో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో పుంగనూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులతో కలసి మీడియాతో మాట్లాడారు. తనను ప్రతిసారీ అత్యధిక మెజార్టీతో గెలిపిస్తూ, తమ కుటుంబానికి అండగా నిలిచిన ప్రజల రుణం తీర్చుకుంటామని, ఇప్పటి వరకు సుమారు 80 శాతం సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. ప్రజా సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులతో సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దేలా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రజలకు తాగునీరు అందించేందుకు గండికోట రిజర్వాయర్ నుంచి, పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తరలించే కార్యక్రమం చేపట్టామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కౌండిన్యనది కాలువల్లో పూడిక తీసి, పారిశుద్ధ్యం మరింత మెరుగుపరుస్తామన్నారు. రాబోవు ఐదు నెలల్లో అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుబాట ఇలా...

తొలుత మార్కెట్‌యార్డు, ఎల్‌ఐసీ కాలనీ, సూర్యనగర్, సాయిబాబాగుడివీధి, కొత్తపేట, కొత్తయిండ్లు, మంగళం కాలనీ, బీడీ కాలనీ, మార్క్సనగర్, దోబీ కాలనీ, నక్కబండలో మంత్రి, జెడ్పీ చైర్మన్‌తో కలిసి పర్యటించారు. మహిళలు మంగళహారతుల తో స్వాగతం పలికారు. వికలాంగుడైన రెడ్డెప్ప తో మంత్రి మాట్లాడి అతడి సమస్యను పరిష్కరించారు.

ప్రారంభోత్సవాలు..శంకుస్థాపనలు

సరస్వతి నగర్‌లో రూ.9లక్షలతో నిర్మించిన కాలువలు, వేసిన రోడ్లను మంత్రి ప్రారంభించారు. అలాగే రూ.17 లక్షలతో హిదయత్‌నగర్‌లో కాలువలు, రోడ్డు పనులు, అలాగే రూ. 10 లక్షలతో మంగళం కాలనీకి రోడ్డు, రూ.11.50 లక్షలతో మార్క్స నగర్‌కు రోడ్లు, పైపులైన్లు, రూ.4 లక్షలతో దోబీకాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

వెల్డింగ్ కార్మికులకు ఎకరా స్థలం

పట్టణంలోని వెల్డింగ్ కార్మికులకు ఎకరా స్థలాన్ని కేటాయిస్తామని మంత్రి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో వెల్డింగ్ కార్మికులు మంత్రిని కలిసి తమ సమస్యలను నివేదించారు. కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

వార్డుబాట విజయవంతం

మున్సిపాలిటీలో మంత్రి నిర్వహించిన వార్డుబాట సోమవారం రాత్రి ముగిసింది. ఆయన ఐదురోజుల పాటు మొత్తం 31 వార్డుల్లో పర్యటించారు. ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. ఆయా వార్డుల్లో ప్రజలు చెప్పిన సమస్యలను సావధానంగా విన్నారు. వివిధ సమస్యలపై మొత్తంగా 207 వినతులు మంత్రికి అందాయి. వాటిల్లో అప్పటికప్పుడు చాలావరకు పరిష్కరించారు. అధికారులను ఆదేశించి మరికొన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.



సరస్వతినగర్ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి



వికలాంగుడిని పరామర్శిస్తున్న మంత్రి



మంత్రికి మంగళహారతులు ఇస్తున్న మహిళలు

నేడు గడప గడపకు..

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ నిర్వహించనున్నట్లు సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చెర్మన్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరింది.

రాకెట్ ప్రయోగాన్ని వీక్షించిన విద్యార్థులు



శ్రీహరికోటలో మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు

పెద్దపంజాణి: ఇస్రో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పీఎస్‌ఎల్‌వి సి–56 రాకెట్ ప్రయోగాన్ని మండలంలోని మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు ఆదివారం శ్రీహరికోటలో ప్రత్యక్షంగా వీక్షించారు. అక్కడ ప్రదర్శనకు ఉంచిన రాకెట్, ఉపగ్రహ నమూనాలను తిలకించారు. అలాగే పులికాట్ సరస్సు, తిరుపతిలోని రీజినల్ సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. విజ్ఞాన యాత్ర ఏర్పాటు చేసిన పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రబాబుకు విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మండల సమాఖ్య అదాయం రూ.64.07 లక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండల సమాఖ్య ఆదాయం ఇప్పటివరకు రూ.64.07 లక్షలకు చేరిందని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీఓ లీడర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి రూ.5.80 లక్షల ఆదాయం రాగా, మండల సమాఖ్య ఏర్పడిన ప్పటి నుంచి ఇప్పటికి రూ.64.07 లక్షలకు చేరిందన్నారు. సంఘాల పటిష్టతకు వీఓ లీడర్లు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామ వీఓ సంఘానికి సమావేశాలు నిర్వహించేందుకు స్వంత భవనాలు నిర్మించి ఇవ్వాలని సభ్యులు ఎంపీపీని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, వైస్ ఎంపీపీ విజయశేఖర్, ఏపీఎం బ్రహ్మానంద రెడ్డి, సీసీలు వెంకట నారాయణరావు, రమణారెడ్డి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

‘స్పందన’లో నాలుగు వినతులు

గంగవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి నాలుగు వినతులు అందాయని తహసీల్దార్ అమర్నాథ్ తెలిపారు.

- కోలార్‌కి చెందిన వ్యక్తితో రెండేళ్ల క్రితం వివాహం కావడంతో అక్కడ రేషన్‌కార్డు మంజూరు నిమిత్తం ఇక్కడ తల్లిదండ్రుల కార్డులో ఉన్న తన పేరును తొలగించాలంటూ డ్రైవర్స్ కాలనీకి చెందిన షేక్‌బాబు కుమార్తె సమీనా అర్జీ ఇచ్చింది. అలాగే ఇదే కాలనీకి చెందిన సుమియా కూడా తన పేరును తల్లిదండ్రుల కార్డు నుంచి తొలగించాలని కోరింది.
- జీఆర్ కొత్తపల్లెకు చెందిన చిన్ననారాయణప్ప భార్య పెద్దపాప పేరునున్న భూహక్కు పత్రాల్లో నమోదైన విస్తీర్ణంలో సరిదిద్దులు ఉన్నాయని.. తన భూమిని రీ–సర్వే చేయించాలని 2వ భార్య నారాయణమ్మ వినతి పత్రం ఇచ్చింది. భజంత్రీ రామప్ప పేరునున్న భూమిని పెద్ద భార్య కుమారులు అనుభవిస్తున్నారని, అడిగితే బెదిరిస్తున్నారని, భూమిలో తనకి కూడా హక్కు కల్పించాలని కోరింది. అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని వీఆర్వోలు, డీటీని తహసీల్దార్ ఆదేశించారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి

రొంపిచెర్ల: తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. రెండుచోట్ల ఓట్లు ఉంటే వారికి అనుకూలంగా ఉన్న చోట మాత్రమే ఓటు పెట్టాలని, మరో చోట తొలగించాలని ఓటర్లకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ అమరనాథ్ ఎంపీడీఓ రాజేంద్ర, ప్రజాప్రతి నిధులు విజయశేఖర్, నాయకులు చెంచురెడ్డి, రామనారాయణ రెడ్డి, శ్రీనాధనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లీజుకు ఆలయ భూముల వేలం



వేలం నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

పలమనేరు: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూముల మూడేళ్ల కౌలు లీజుకు సంబంధించి స్థానిక ఆలయం వద్ద ఎండోమెంట్ అధికారులు సోమవారం బహిరంగ వేలం వేశారు. గంగవరం గ్రామ సర్వే నంబర్ : 422/8లో 39 సెంట్లు, 451/4లో 82 సెంట్లు, 457లో 2.40 మొత్తం 3.61 ఎకరాల భూములకు సంబందించి వేలం నిర్వహించారు. పట్టణానికి చెందిన కె క్రిష్ణమూర్తి రెడ్డి రూ.3.17లక్షలకు వేలం పాడి దక్కించుకున్నాడు. ఆ భూముల్లో పుంగనూరు రకం పొట్టి ఆవులను సంరక్షించేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కమలాకర్, సూపర్‌వైజర్ చలపతి, దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

త్వరలో జగనన్న మహిళా మార్కెట్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సమైక్యలతో జగనన్న మహిళా మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని 1015 మెప్మా గ్రూపులు, 26 సమైక్యలు ఏర్పాటు చేశారు. ఈ సమైక్యలే కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. ముఖ్యఅతిథిగా చైర్మన్ మాట్లాడారు., గ్రూపులు, మహిళా సభ్యులు సమైక్యలుగా ఏర్పడటం హర్షణీయమన్నారు. పట్టణంలో మహిళా సమైక్యలతో జగనన్న మహిళా మార్కెట్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మెప్మా సీఈఓ జగదీష్, స్థానిక నాయకులు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగళ విద్యావాణి మాసపత్రిక ఆవిష్కరణ



సంచికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ×మంగళ విద్యావాణి₹ 22వ సంచికను ఆవిష్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ రాధాకృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సంచికను ఆవిష్కరించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల ఉపాధ్యాయులు ఐదేళ్లుగా పాఠశాల తరపున మంగళవిద్యావాణి మాసపత్రికను నడపడం అభినందనీయమన్నారు. మాసపత్రికలో కథలు, కవితలు, వ్యాసాలు, విద్యారంగానికి సంబంధించిన వ్యాసాలను విద్యార్థులతో రాయించి వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. మాసపత్రిక సంపాదకుడు అరుణ్ శివప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పఠనా నైపుణ్యాలు, వ్యాసరచనా శక్తిని పెంపొందించేందుకు మాసపత్రిక దోహదపడుతుందన్నారు. సంచిక ముద్రణకు సరస్వతి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.4 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



చావడిలో కొలువుదీరిన పీర్లు

పెద్దపంజాణి: హిందూ–ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగను ఆదివారం మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీ పెనుగొలకలలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. వారం రోజులుగా నడివీధి చావిడిలోని పీర్లకు హిందువులు, ముస్లింలు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని చెక్కెర, బూంది చదివింపులు చేశారు. సోమవారం వేకువ జామున అగ్నిగుండంలో నిప్పులపై నడిచి మొక్కులు చెల్లించారు. రాత్రి 7 గంటల నుంచి పీర్లను గ్రామంలో ఊరేగించిన అనంతరం జలధికి తరలించారు. కార్యక్రమంలో సచివాలయ గృహ సారథులు సురేంద్ర, రమణా రెడ్డి, పార్టీ నాయకులు సుబ్రమణ్యం, ఇంతియాజ్, బషీర్, రాజన్న, వినోద్, రాజశేఖర్, బి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

దాదేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని దాదేపల్లె లో సోమవారం ఘనంగా పీర్ల పండుగను నిర్వహించారు. పీర్లను గ్రామంలో మేళతాళాల నడుమ ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద పీర్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



అగ్నిగుండం చుట్టూ ప్రదర్శన చేస్తున్న యువకులు

అనుబంధ కమిటీలే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ అనుబంధ కమిటీలే కీలకమని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. పులిచెర్లలో సోమవారం మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, అనుబంధ కమిటీలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాబోవు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి పార్టీ అత్యధిక మెజారిటీతో గెలుపొందేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ ప్రజాసమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ముర్వత్ బాషా, రెడ్డీశ్వరరెడ్డి, ఎస్‌ఎస్ రెడ్డి ప్రకాష్, పోకల చంద్ర, వల్లివేడు రాజారెడ్డి, నాగరాజ ప్రసాద్, హేమసుందరరెడ్డి, షుకూర్, రెడ్డి అహమ్మద్, రాణెమ్మ, మంజుల, ప్రతాప్‌రెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

రొంపిచెర్ల: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీబీ సూపర్‌వైజర్ లక్ష్మీపతి అన్నారు. అయన సోమవారం చిచ్చిలివారిపల్లె గ్రామ సచివాలయంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ నెల 3న చిచ్చిలివారిపల్లెలో వైద్య శిబిరం నిర్వహిస్తామని, క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాయంత్రం పూట జ్వరం రావడం, వారం రోజులగా దగ్గు ఉండడం, గళ్ల పడడం, గళ్లలో రక్తం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలతోపాటు దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారు శిబిరంలో వైద్యసేవలు పొందాలని కోరారు. క్షయ అనుమానిత లక్షణాలతో ఉన్న వారిని గుర్తించి పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేసి నిర్ధారించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు శివగణేష్, తారకనాథ్, ఎంఎల్‌హెచ్‌పీలు భారతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణ వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి అనుబంధ ఆలయమైన వరదరాజులస్వామి ఆలయంలో మంగళవారం సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, వ్రతం, రాత్రి స్వామివారికి గరుడ సేవ నిర్వహిస్తామన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పవిత్ర

- అడ్డు అదుపు లేకుండా వెలుస్తున్న బ్యానర్లపై చర్యలేవీ?
- బయట ప్రాంతాల కుక్కలను తెచ్చి పట్టణంలో వదులుతున్నారు
- అసంపూర్తిగా ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు ఆలస్యమెందుకు?
- మున్సిపల్ సమావేశంలో నిలదీసిన కౌన్సిలర్లు

పలమనేరు: రాధాబంగ్లా, చెరువుకీలేరిలలో అక్రమ లేఅవుట్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని 16వ వార్డు కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌రాజు డిమాండ్ చేశారు. దీనిపై విచారణ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, గత సమావేశంలో చర్చించినా పరిష్కారానికి నోచుకోని సమస్యలపై మాట్లాడాలన్నారు. మున్సిపల్ వైస్ చెర్మన్ కిరణ్ మాట్లాడుతూ, పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, కొందరు కుక్కలు పట్టి తెచ్చి పట్టణంలో వదిలేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ బదులిచ్చారు. మున్సిపాలిటీకి ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయని, దీనికి కారణమేమిటని 15వ వార్డు కౌన్సిలర్ హయాత్, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ కోదండరామయ్య ప్రశ్నించారు. సంబంధిత బిల్డింగ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఈ సమస్య నెలకొందని, దీనిపై తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. రాధాబంగ్లాలో రాజకాలువ సమస్య, నిబంధనలు పాటించకుండా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని రెండు సమావేశాల్లో చెప్పినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. రాజకాలువకు సంబంధించి రూ.16 లక్షలు మంజూరైందని, త్వరలోనే పనులకు పూనుకుంటామని కమిషనర్ బదులిచ్చారు. పట్టణంలో ఎక్కడబడితే అక్కడ బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారని దీనిపై మున్సిపల్ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు సభ్యులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు.

అజెండా అంశాలకు ఆమోదం

సమావేశంలో ఉంచిన అజెండా అంశాలను ఆమోదించారు. పీవీసీ పైప్‌లైన్ల నిర్మాణం, డ్రైన్లు, ఫాగింగ్ మెషిన్ల కొనుగోళ్లు, ఎల్‌ఈడీ వీధిదీపాలు.. తదితర పది అంశాలను పాలకవర్గం ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడి అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



రైతులకు చాప్ కట్టర్‌పై అవగాహన కల్పిస్తున్న పశుసంవర్థక శాఖ అధికారులు

గంగాధరనెల్లూరు: పాడి రైతుల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పశు సంవర్థక శాఖ జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ అరీఫ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన చాప్ కట్టర్ల యంత్రాలను ఎంపీపీ అనిత ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హులైన 57 మందికి రూ.33 లక్షల విలువ చేసే చాప్ కట్టర్లను అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకుని రైతులు పాడి పెంపకాన్ని విస్తరింపచేయాలని సూచించారు. అనంతరం ఎంపీపీ అనిత మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం గడ్డి విత్తనాలు కూడా 70 శాతం రాయితీపై అందిస్తోందని తెలిపారు. అదేవిధంగా టీఎంఆర్ దాణామృతం 60 శాతం సబ్సిడీ పంపిణీ చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. అధిక పోషణ విలువలు కలిగిన అమృత దాణామృతం అధిక పాల దిగుబడికి తోడ్పాటు అందిస్తుందన్నారు. రాష్ట్రప్రభుత్వం పాడి రైతుల అభివృద్ధికి కీలక నిర్ణయం తీసుకుని లీటర్ పాల ధర రూ.35 నుంచి రూ.40 వరకు పెంచిందన్నారు. అనంతరం చాప్ కట్టర్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మురళీమోహన్, పశు వైద్యాధికారి డాక్టర్ నాగాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మునిరాజారెడ్డి పలువురు పాల్గొన్నారు.